# ప్రేమ పాశము

బాలకవి వత్సవాయి సత్యనారాయణవర్మగారు

"ప్రేమ" శబ్ద మత్యంతమధురమైనది. శబ్దమే యింత మధురమైయుండ దానియర్థ మెంత మాధుర్యముగనుండునో వేరుగ వ్రాయవలయునా? కాని ప్రేమ అనంతమైనటువంటిదియు, అవ్యయమై నదియు నగుటచే దానియర్థము తెలిసికొనుట చాల కష్టము. యువకులు దేనియందు మగ్నులయ్యెదరో, వృద్ధులు దేనిస్మరణమాత్రమున తమ జీర్ణశరీరముల యొక్క బాధను త్యజించెదరో, అట్టిప్రేమ శబ్దార్థము వర్ణనాతీతముగదా? సాహసము, ధైర్యము, పవిత్రతయు, మఱియు ఆత్మవిశ్వాసము, యీనాలుగును ప్రేమశబ్దార్థము తెలిసికొనుటకును, పొందుటకును సాధనములు.

*   *   *

మోహనసింగు కల్యాణపురమునగల ప్రజలలో మిక్కిలి ధనవంతుఁడు, సుఖవంతుఁడును, సదాచార సంపన్నుఁడు, సజ్జనుఁడును కూడనైయుండెను. కాని జూదమాడుటయన్న నాతని కెక్కువయిష్టము. అంత్యమున నాతఁడు తనసర్వస్వమును కల్యాణపుర పాలకుఁడైన ఠాకుర్ శ్యామసింగునకు జూదమున నర్పించెను.

*   *   *

"వీణ" పదునారేండ్ల యువతి. సద్గుణసంపన్నురాలును, సౌందర్య రాశియునైయుండెను. వీణ బాల్యముననే యెన్నియో గ్రంథములఁ జదివెను. ఆత్మ విశ్వాసమే మనోవాంఛితంబుల నెరవేర్చునని తన విద్య వలన తెలిసికొనెను. తానొక భూపాలకుని పత్నిగావలెననితన మనోభిలాష! ఈమె తనతండ్రి మోహనసింగు జూదమున సర్వస్వమును గోల్పోవుట కెంతయు చింతించెను. కాని విద్యావతి యగుటచే తిరుగ ధైర్యమవలంబించెను.........ఆసమయమున కల్యాణపుర సమీపమున గల పల్లెలందును, కల్యాణపురమునందును, "రామజోగి" యను క్రూరుఁడు తన యనుచరులతో దోపిడిచేయుచుండెను. కల్యాణపురమునందా క్రూరుని భయముచే రేయింబవళ్లు ద్వారముల బంధించి స్త్రీపురుషులు భయభ్రాంతులై నిద్రాహారములులేక వసింపుచుండిరి.

*   *   *

అశోకుఁడు రామనగర సేనాధిపతి. మిక్కిలి ధైర్యశాలి యగు యువకుఁడు. బలాఢ్యుఁడు సుందరుఁడుకూడనైయుండును. అశోకుఁడు రామజోగిని వెదకుచు తిరుగుచుండెను. ఒకనాఁడు కల్యాణపుర సమీపమున కరుదెంచెను. సమీపమున జరుగుచున్న యొక భయంకర ఘోరపోరాటము నాతఁడు తిలకించెను. ఆశ్చర్యక్రోధములచే నాతని శరీరము కంపించెను. పదిపండ్రెండుగురు దుష్టులతో నొక వీరరమణి పోరాడుచున్నట్లాతనికి కనుపించెను. వెంటనే యచ్చోటి కరిగెను. దుష్టులు పరుగిడిరి. వీరరమణీయశోకు లొకరినొకరు ప్రేమదృష్టులతో చూచుకొనిరి. ఇరువుర హృదయములందును ప్రేమ యంకురించెను. "ప్రేమపాశము"చే నిరువురు గాఢముగా కట్టబడిరి వీరరమణి మనవీణయే! దుష్టులు రామజోగి యనుచరులేకదా!

*   *   *

మరునాటి యుదయమున దొంగిలు పట్టువడిరని వదంతి బయలుదేరెను. కల్యాణపురజనులెల్ల నిశ్చింతతో గృహములనుండి వెలికివచ్చి తిరుగాడఁజొచ్చిరి. "సాయంకాలము నాలుగుగంట లాయెను. రామజోగియనుచరు లొక పథికుని దోచిరి. మఱియు నాపథికుని చేతనే కల్యాణపురగ్రామజనులకు "రామజోగి వచ్చుచున్నాఁడు. జాగ్రత్త"యని వర్తమానమంపిరి. జనులెల్లరు యథావిధి మందిరంబులఁ జొచ్చి ద్వారముల బంధించుకొనిరి. ఆవర్తమానము తెచ్చిన పథికుని కెవ్వరు నిలువస్థానమైన నివ్వరైరి. "రామజోగి వచ్చుచున్నాఁడు." అను వాక్యము విన్నంతమాత్రమున వీరరమణియగు వీణయొక్క శరీరము క్రోధముచే కంపించెను. వెంటనే తన తండ్రి కరవాలమును చేతధరించెను. సింహనాద మొనర్చుచు కల్యాణపురమైదానమందు నిలచెను. మఱియు పిఱికిపందలై గృహంబుల దాగియున్న ప్రజల కిట్లు ధైర్యము గొలుపఁబలికెను. "స్త్రీల యొక్కయు, బాలబాలికల యొక్కయు ప్రాణముల రక్షింపజాలని వారు పురుషులు కారు. నపుంసకుల క్రిందనే పరిగణింపఁబడుదురు. ఇండ్లయందుఁ దాగియున్నచో బలవన్మర

ణమునకు పాత్రులయ్యెదరు. నేనబలను ! నా పేరు వీణ యనెదరు ! మీకు సహకారిణిగానుండి యా దుష్టుల దునుమాడెద! పిఱికిపందలై ఇండ్లలో నిద్ర బోకుఁడు. మనజన్మలు శాశ్వతము లకావు. రండు! మీ మగతనముజూపి పోరాడుఁడు. దుష్టసంహార సమయమున ప్రాణముల గోల్పోదుమా, వీరస్వర్గము లభించును! లేదా, విజయము సమకూడిన, సర్వ్చా రముగ వసింపవచ్చును! సోదరులారా, భయదేవ తను పారద్రోలుడు! దుష్టుల దునుమాడుడు!...... వీణ యొక్క సాహసవాక్యములు గ్రామజనుల మనంబుల కఠోరఘాతంబులవలెఁ జొచ్చెను. గ్రామజను లెల్ల ధైర్య మవలంబించిరి. తమతమ ఆయుధంబుల దీసిరి. వీణచెంతకు వచ్చిరి. వీణ కాధిపత్య మొసంగిరి. ప్రాణములపై నాశవిడచి పోరాడిరి. వీణ తన కరవాలముచే రామజోగి కుడిభుజంబున గొప్ప గాయము కలుగఁజేసెను. అకస్మాత్తుగా నశోకుఁడా స్థలమునకు వచ్చెను. రామజోగి పోరాటమున నిలువలేక తనయనుచరులతో పరుగిడెను. వీణ యొక్క సాహస కార్యమునుఁజూచి యశోకుఁడు మిక్కిలి సంతసించెను. మఱియు నిట్లు బల్కెను. 'ఇట్టి దుస్సాహస కార్యములవలన నెప్పుడైన ప్రాణ హాని సంభవించును సుమీ!'

అశోకుని వాక్యముల కడ్డమువచ్చి వీణ గంభీర పూర్వకముగ నిట్లు బల్కెను. జీవనము లశాశ్వతములు. ఎవ్వరును అన్యులపై నాధారపడి యుండ రాదు. మన సర్వస్వము దొంగిలించిన పిదప మన మేమి చేయగలము.' ఆహా! వీరాంగనయగు వీణ ధన్యురాలు. ఇట్టి భారత వీరాంగనలను దైవము ప్రసాదించుగాక! అశోకుఁడు వీణతో ప్రేమపూర్వకముగ మరల కొలఁదిదినములలో కలియుదమని బలికెను. రామజోగి వృత్తాంతము తెలియఁజేయుటకు రామనగరునకుఁ జనెను.

* * *

మోహనసింగు సర్వస్వమును గోల్పోవుటచే ఠాకుర్ శ్యామసింగునకు లొంగిపోయెను. ఒక నాఁడు మోహనసింగ్ శ్యామసింగుల కిదిగువ సంభాషణమాయెను.

శ్యామసింగు:—మోహనా ? నీవు ప్రస్తుత మత్యంత దరిద్రదశలో నుంటివి. నీకట్టి యిక్కట్టులును లేకుండఁజేయుదును. నీ పుత్రికయగు వీ...ణ... నునా...కొసంగుము లేనిచో పలుచిక్కులకు లోనయ్యెదవు !

మోహ:—మహాశయా, నా యాత్మతో సహితము నా సర్వమును తమ కర్పించియే యుంటిని. గాని నా పుత్రిక నొసంగుటకు నా మనంబొప్పదు, నా శక్యముకాదు.

శ్యామ:—అటులైన నీవు పలుచిక్కులకు లోనయ్యెదవు ! నాతో వైరము నీకు తగదుసుమీ !

మోహ:—ప్రభుచిత్తము. "సత్యమేవ జయతి"

* * *

శ్యామసింగు బహు క్రూరుఁడు. చిరకాలమునుండి వీణపై తానత్యధిక వ్యామోహముతో నుండెను. అందుకై యెన్నియో క్రూరకార్యముల నాచరించెను. తుదకు జూదమున మోహనసింగు యొక్క సర్వస్వము లాగుకొనియెను. వీణను బలాత్కారముగ తన గృహంబునకు తీసికొనిబోవ యత్నించెను. అందు కొఱకే "రామజోగి" యను చోరుని వేషమును ధరించి గ్రామమున దోపిడి యగునని భయము కల్పించెను. చివరకు పోరాటమున నోడెను. వీణ పతివ్రతయు, వీరరమణియు నగుటచే వీని యాటలు సాగ లేదు. ఎన్నియో కుట్రల యోజింపుచుండెను.

* * *

మోహనసింగు శ్యామసింగువలన తన కేమికీడు వచ్చునో యని భయపడుచుండెను. మఱియు పుత్రికయగు వీణతో గూడ కల్యాణపురము విడచి యేదేని గ్రామముపోవ నూహించుకొనెను. తన యభిలాష వీణ కెఱింగించెను. వీణ అశోకుని యందుండెడి ప్రేమచే అందుల కంగీకరించకపోయెను.

* * *

ఠాకుర్ శ్యామసింగు మోహనసింగుతోపాటు వీణను కూడ తన కోటయందు బంధించెను...... రామనగరున అశోకుని కీ వార్త తెలిసెను. వీణ కిట్టి కష్టము ప్రాప్తించెనని విన్నంతమాత్రమున అశోకుని ముఖాకృతి మారెను. నేత్రములనుండి క్రోధాగ్ని వెలువడుచుండెను. తత్క్షణమే వలయు దుస్తుల ధరించి తురగమునెక్కి కల్యాణపురమువైపు అత్యధిక వేగముగ గుఱ్ఱమునుఁ ద్రోలెను. వాక్యము బలుకునంతలో అశోకుని యశ్వము కల్యాణపురపు కోటద్వారము చెంత నాగెను. అశోకుఁడు తన గుఱ్ఱమునుదిగి దాని నచ్చోటనుంచి యొరనుండి కరవాలమునుదీసి ఇటు నటు ద్రిప్పుచు నిర్భయముగ కోటలోనం బ్రవేశించెను. వీణయున్న గదిచెంతకుంబోయి వీణను విడిపించెడి యత్నములో నుండెను. ఇంతలో శ్యామసింగు పలువురు సహచరులతో యశోకుని బంధించెను. పిమ్మట అశోకుని ఒక పెట్టెయందుంచి మూత బిగించి రామనగరు పరిపాలకునకు కానుకగా బంపెను.

* * *

నాఁడు శరత్కాలపూర్ణిమ. రామనగరు ప్రభువగు ప్రతాపసింగు తనకోటలో పడకకుర్చీయందు కూర్చొని చల్లగాలి సేవించుచుండెను. ఇంతలో కల్యాణపురమునుండి యొక పెట్టెవచ్చెనని ద్వారపాలకుం డొకఁడు ప్రతాపునకు విన్నవించెను. వెంటనే దానిని తెప్పించి విప్పించెను. చూచుసరికి ప్రతాపుని హృదయము కలవరమందెను. అశోకుని శవసత్తి శైత్యోపచారముల చేయించెను. ఆశోకుని వలన ప్రతాపుడు విషయమంతయు తెలిసికొనెను. సైన్యము సిద్ధముచేయించెను. అశోకుఁడు తనసేనతో కల్యాణపురము కోటపై దాడివెడలెను.

* * *

ఇచ్చట శ్యామసింగు మోహనసింగును పలుబాధలు పెట్టెను. ఎన్ని చిక్కులుపెట్టినను మోహనుఁడు, వీణను తనకొసంగుటకు ఇష్టపడలేదు. ఎట్టకేలకు వీణను తన మనోప్సితంబు నెఱుఁగజేసెను...పాపము. వీణ శ్యామసింగున కిట్టి బుద్ధికలదని ఇదివర కెఱుంగదు. ఇందులకై తన్ను బంధించెనని కూడ తెలియదు. తండ్రి జూదరి యగుట తన్నుగూడ పందెములో నొడ్డెనేమో యని మాత్రమే యామె యనుకొనుచుండెను. లేసిచో ఇంతకు పూర్వమేయైనచో నాతని యనువుల గొనెడిదియే! వీణపై సామదాన భేద దండోపాయంబు లుపయోగించెను. అంత్యమునకు శ్యామసింగు ఆలోచించి తన సమ్మతము తెలియఁ జేయుటకు వీణకు మూడుదినంబుల నొసంగెను.

* * *

మూడవనాటి యుదయమున పరిస్థితులు మారెను. రామనగరు సైన్యమంతయు కల్యాణపురపు కోట చుట్టును ముట్టడించెను. ఇరుసైన్యములకు గొప్ప పోరాటము కలిగెను. అశోకుఁడు జయమందెను. కోట స్వాధీనముఁ జేసికొనెను. శ్యామసింగును బంధించెను. వీణా మోహనుల విడిపించెను...... అశోకుఁడు శ్యామసింగు, వీణా మోహనులతో రామనగరు చేరెను. ప్రతాపసింగున కాజన్మాంత కారాగారవాసశిక్ష విధించెను. మోహనసింగునకు తన సర్వస్వమును ఇప్పించెను. వీరుఁడగు అశోకుని కల్యాణపురప్రభువుగా నొనర్చెను. ఆహా! నాటి వీణాశోకుల యుత్సాహ మపారము. ఒక్కమారుగ నిరువురు కౌగిలించుకొనిరి. వీణా అశోకుల కత్యంత వైభవముగ వివాహము జరిగెను.

* * *

ఎల్లప్పుడును సత్యమే జయముపొందుచున్నది... దుర్మార్గుల కెల్లప్పుడు కష్టములే సంభవించును... ఆత్మవిశ్వాసమే కార్యసాఫల్యము...ధైర్యమే ప్రధానము...సోదరీమణులు, విద్యయున్ననేగాని విదుషీమణులు కాజాలరు...విదుషీమణులులేని దేశమునకు సౌభాగ్యము చేకూరదు.